క్లుప్తంగా

ఘనంగా శాంతి ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో 11 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ద్వాదశి హారతులు ఇచ్చారు. శాంతి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, రకరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్త సీతా రామయ్య పాల్గొన్నారు.

అప్పినపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవిలో బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి వివరించారు. అనంతరం మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వనజ, మేల్ హెల్త్ అసిస్టెంట్ నాగార్జున, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆటోలు ఢీ: ఆరుగురికి గాయాలు

చౌడేపల్లె: ఆటోలు ఢీకొన్ని ఆరుగురికి గాయాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లె–పలమనేరు మార్గంలో చోటుచేసుకుంది. వివరాలు.. చౌడేపల్లె నుంచి పలమనేరు వైపు పలమనేరు వైపు నుంచి చౌడేపల్లె వైపు వస్తున్న రెండు ఆటోలు చారాల సమీపంలోని రెడ్డెమ్మ ఆలయం వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో బత్తలాపురానికి చెందిన వెంకటరమణ(52)తోపాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన లారీ

- మద్యం మత్తులో డ్రైవింగ్
- కల్వర్టు ఢీకొని ఆగిన వైనం



చౌడేపల్లె: కట్టెల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చిన్న కల్వర్టు ఢీకొని ఆగింది. మదనపల్లెకు చెందిన కొందరు తెల్లనీళ్లపల్లె వద్ద కట్టెలను కొనుగోలు చేసి లారీకు లోడ్ చేశారు. గడ్డంవారిపల్లె రోడ్డు వైపు నుంచి చౌడేపల్లె వైపు లారీ బయల్దేరింది. డ్రైవర్ వెంకటేష్ మద్యం సేవించి వాహనాన్ని మితిమీరిన వేగంతో నడిపాడు. దీంతో బైసాని ఫంక్షన్ హాల్ వద్ద లారీ అదుపు తప్పింది. రోడ్డు పక్కన కల్వర్టు ఢీకొని 50 మీటర్ల దూరం దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ చక్రం వద్ద అమర్చిన కట్టలతోపాటు ఇంజిన్ దెబ్బతిని రోడ్డుపైనే ఆగిపోయింది. మరో 50 మీటర్ల అలాగే దూసుకుపోయి ఉంటే వారపు సంత ప్రాంతంలో పెనుప్రమాదానికి దారితీసి ఉండేది. సంతకు దూరంగా జనం లేని ప్రాంతంలో ఇది చోటుచేసుకోవడం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మండలంలో బీజేపీ ప్రజాపోరు



ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్న విజయకుమార్

పెద్దపంజాణి: మండలంలో మంగళవారం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ప్రభాకర్ అధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ గొనివారి విజయకుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ ఉమాపతి, పార్టీ నాయకులు వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. ఊటుపల్లె, తాటిగుంటపాలెం, చింతపర్తివారిపల్లె క్రాస్, కంభంవారిపల్లె క్రాస్, సదుం, జోగివారిపల్లె, తిమ్మానాయనపల్లెలో పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

చెరువుల్లో అక్రమార్కుల డబుల్ ధమాకా!

- బంకమట్టి, ఇసుక యథేచ్ఛగా రవాణా
- రేయింబవళ్లూ జేసీబీలతో మట్టి, ఇసుక తవ్వకాలు
- వైఎస్సార్‌సీపీ పేరు చెప్పి తప్పించుకుంటున్న వైనం
- తమకు ఏమాత్రమూ సంబంధం లేదంటున్న అధికార పార్టీ నేతలు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



గంగవరం మండలం సామరాజుపల్లెలో జేసీబీలు, ట్రాక్టర్లతో తరలిస్తున్న బంకమట్టి



బంకమట్టిని తవ్వాక కింద ఉన్న ఇసుక నిల్వలు

పలమనేరు: చెరువుల్లో బంకమట్టి, ఇసుకపై కన్నేసిన అక్రమార్కులు తమ పంథా మార్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పలమనేరు నియోజకవర్గంలో చెరువుల్లోని బంకమట్టి, దాని కింద ఉన్న ఇసుకను తోడేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ని యోజకవర్గంలో చెన్నై– బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులకోసమంటూ కొందరు ఈ అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే తాము వైఎస్సార్‌సీపీ నాయకుల మనుషులమంటూ నెపం నెట్టేసి పనులు కానిచ్చేస్తున్నారు. అయితే వీటితో తమకేమాత్రమూ సంబంధం లేదని అధికార పార్టీ తేల్చి చెప్పారు. పైగా ఎవరైనా వైఎస్సార్ సీపీ అని పేరు చెబితే వాళ్ల భరతం పట్టి, అధికారులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

చెరువుల్లోని ఇసుకకోసం మట్టి తవ్వకాలు

నియోజకవర్గంలోని చెరువుల్లో యథేచ్ఛగా బంకమట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ఇటుకల తయారీకి కొందరు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు మరికొందరు చెరువుల్లో బంకమట్టిని జేసీబీలతో తోడి ట్రాక్టర్లకు నింపి తరలిస్తున్నారు. బంకమట్టి లోడు రూ.600 నుంచి రూ.800 దాకా పలుకుతోంది. దీంతో కొందరికి ఇదో లాభసాటి వ్యాపారంగా మారింది. ట్రాక్టర్ల యజమానులకు పనులు నిత్యం లభిస్తుండడంతో అద్దె తక్కువైనా చెరువుల్లో మట్టి తరలింపు పనులకు ఆసక్తి చూపుతున్నారు. అయితే అసలు కథ ఇదికాదు.. చెరువుల్లోని పైనున్న బంకమట్టిని తోడేశాక కిందనున్న ఇసుక వీరి అసలు టార్గెట్. ఇందుకోసం బంకమట్టి నెపంతో ఇసుకను తోడి అమ్ముకుంటున్నారు. ఇసుక లోడు రూ. 5వేల దాకా ఉంది. దీంతో వీరికి ఈ వ్యాపారం డబుల్ ధమాకాలా మారింది.

అక్రమార్కులంతా అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ...

పలమనేరు నియోజకవర్గంలో 110 దాకా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,700 దాకా చిన్నపాటి చెరువులున్నాయి. వీటిల్లో సగం దాకా చెరువుల్లో నీరు తగ్గింది. ఇదే అదునుగా చేసుకొని అక్రమార్కులు చెరువుల్లో బంకమట్టిని దాని కింద ఉన్న ఇసుకను తోడేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అధికార పార్టీ నేతల అండ, మద్దతు ఉందంటూ ఏమార్చుతున్నారు. ఇంకొందరు తాము ఎక్స్‌ప్రెస్ హైవే కోసం మట్టిని తవ్వుతున్నామని నమ్మబలుకుతూ అక్రమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో వీరి వ్యాపారం మూడు బంకమట్టి లోడ్లు, ఆరు ఇసుక ట్రాక్టర్లుగా మారింది.

ఏమాత్రం పట్టించుకోని అధికారులు

చెరువుల పర్యవేక్షణ బాధ్యత చూడాల్సిన ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తే– తాము చెరువు కట్టల మరమ్మతులు మాత్రమే చూస్తామని బంకమట్టి, ఇసుకతో తమకే సంబంధం లేదని చెబుతున్నారు. ఇక రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదిస్తే– అది మండల పరిషత్ కార్యాలయం వ్యవహారమని చేతులు దులుపుకుంటున్నారు. చివరకు మండల పరిషత్ కార్యాలయ అధికారులను సంప్రదిస్తే– అది పంచాయతీ కార్యదర్శులు చూసుకుంటారని ఒకరి మీద ఒకరు దాటవేత ధోరణితో ఉంటున్నారు. వీరి ఉదాసీనతపై రైతులు, అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే వెంకటేగౌడ దృష్టికి సాక్షి తీసుకెళ్లగా.. వైఎస్సార్ సీపీ నాయకుల పేరు చెప్పి చెరువుల్లో మట్టి, ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇటు చూడండి సారూ!

నియోజకవర్గంలోని గంగవరం మండలం మేలుమాయి పంచాయతీ సామరాజుపల్లె సమీపంలోని చెరువులో కొందరు మూడునెలలుగా బంకమట్టిని, ఇసుకను జేసీబీలతో తోడేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇప్పటికే ఈ చెరువులో వేలాది లోడ్ల మట్టి, ఇసుక మాయమైంది. అలాగే మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె పెద్దచెరువులో ఆరునెలలుగా ఇదే తంతు. ఇక్కడ నాలుగైదు జేసీబీలు, పది ట్రాక్టర్లు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. ఈ చెరువులో 5వేల లోడ్ల మట్టి, ఇసుకను ఇప్పటికే మాయం చేశారు! ఇక పలమనేరు మండలంలోని మొరం చెరువులో రాత్రిపూట అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. బేలుపల్లె చెరువులోనూ జేసీబీలు పగలే మట్టిని తరలిస్తున్నాయి.

పార్కు పనుల పరిశీలన



గోకుల్ ఏరియాలో పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీ ప్రజలు కాసేపు తమ కష్టాలు, బాధలు అన్నీ మరచిపోయి ఆహ్లాదంగా, ఉల్లాసంగా గడపాలనే ఉద్దేశంతో పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ చెప్పారు. మంగళవారం చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కులలో పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, పుంగమ్మ చెరువు కట్టపై సుమారు రూ.3 కోట్లతో ఒక పార్కు, అలాగే గోకుల్ సర్కిల్, ఎల్ఐసీ కాలనీలలో రూ.20 లక్షలతో రెండు పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్కులలో చిన్న పిల్లలు ఆటలు ఆడుకునేందుకు వీలుగా బొమ్మలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే బెంచీలు, ఎల్ఈడీ దీపాలు, లాన్లు , పూల మొక్కలు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ఈ పార్కులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు జావీద్ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహు కేతు పూజలు



మయూర వాహనంపై సుబ్రమణ్యస్వామి

రామకుప్పం: మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం రాహుకేతు మండపంలో భక్తులు రాహు కేతు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కర్ణాటక భక్తులు సుబ్రమణ్యస్వామి వారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. సుబ్రమణ్యస్వామి వళ్లీదేవసేన సమేతుడై మయూర వాహనంపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సాయంత్రం భక్తులు స్వామివారికి కావడులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

3న పల్స్‌పోలియో శిబిరం



పోస్టర్లు విడుదల చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్



గుడుపల్లె: పల్స్‌పోలియోపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డిల్‌ఫిన్

పుంగనూరు: మార్చి 3న పల్స్‌పోలియో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. మంగళవారం కమిషనర్ నరసింహప్రసాద్, డాక్టర్లు రంజిత, మాధవరెడ్డితో కలసి పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. చైర్మన్ మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పట్టణంలో 43 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగేంద్ర పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

సదుం: వచ్చే నెల 3వ తేదీ మండలవ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓతోపాటు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీష మాట్లాడారు. పల్స్‌పోలియో చుక్కలు వేయడానికి మండలంలో 44 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులను 3,140 మందిని గుర్తించామని, వీరందరికీ చుక్కలు వేయాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ వరప్రసాద్, సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డిల్‌ఫిన్ కోరారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్‌పోలియోపై అవగాహన కల్పించారు. ప్రతి అంగన్‌వాడి, పాఠశాలలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 3,862 మంది ఉన్నట్టు గుర్తించామని, వీరందరికీ పోలియో నిరోధక చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు బాబు, దుర్గాప్రసాద్, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సిబ్బంది. ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘ నేతలపై కేసులను ఎత్తేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీఎన్జీవో నాయకులు

పలమనేరు: సమస్యలపై పోరాటాలు చేసిన సందర్భంలో ఉపాధ్యాయ, ఉద్యోగసంఘ నేతలపై బనాయించిన కేసులను ఎత్తేయాలని స్థానిక ఏపీజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీఎన్జీవో కార్యాలయంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ నేతలు మాట్లాడారు. గతంలో తమ సమస్యల సాధన పరిష్కారం కోసం ఉద్యమించినప్పుడు పోలీసులు కేసులు నమోదు చేశారని, వాటిని ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో ఏపీజేఏసీ నేతలు ఆనంద్‌బాబు, లక్ష్మీపతి, రమణ, విజయకుమార్, సుదర్శనాచారి తదితరులు పాల్గొన్నారు.


శ్రద్ధగా చదవండి

పూతలపట్టు: పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులందరూ సన్నద్ధం కావాలని సూచించారు. కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. పరీక్షల కాలంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఉల్లాసాలకు దూరంగా ఉండి జ్ఞాపకశక్తితో అర్థం చేసుకుని చదువుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందుగా మండలంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న టెట్ పరీక్షలను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం

పలమనేరు: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అజెండా ఉంటుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. పీసీసీ ఉపాధ్యక్షులు, పలమనేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పార్థసారథిరెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల సమావేశం మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మొన్నటి కర్ణాటక, నిన్నటి తెలంగాణ ఎన్నికల్లో తమ పార్టీ మ్యానిఫెస్టోలను ప్రజల ఆదరించారని పేర్కొన్నారు. మార్చి 1న తిరుపతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని, దీనికి జాతీయ, పీసీసీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు, ముఖ్యనేతలు హాజరు కానున్నారని తెలిపారు.

బైక్‌ను ఢీకొని పరారయ్యే యత్నం



చెట్టును ఢీకొని కాలువలో పడిన కారు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మధు, జగదీశ్, మధు

- ఆపై అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు
- ఐదుగురికి తీవ్రగాయాలు
- పోలీస్‌స్టేషన్ వద్ద ప్రమాదం
- 108లో మదనపల్లెకు తరలింపు

చౌడేపల్లె: మితిమీరిన వేగంతో వస్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో అక్కడి నుంచి తప్పించేందుకునేందుకు మరింత వేగంతో మరోమార్గంలో వెళ్తూ అదుపు తప్పి దూసుకుపోయి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలు..బైక్‌లో ఇద్దరు దుర్గసముద్రం వద్ద వస్తుండగా, రాయలపేట నుంచి చౌడేపల్లె వైపు మితిమీరిన వేగంతో పెద్దపంజాణి మండలం మారప్పల్లెకు చెందిన యలగటూరి మధు(35) కూరగాయల కొత్తపల్లెకు చెందిన జగదీష్(39), వెంకటరమణ(37) వెళ్తూ పలమనేరు మార్గంలోని దుర్గసముద్రం సబ్ స్టేషన్ వద్ద బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మోటార్ సైక్లిస్టులు గాయపడ్డారు. ఇది గమనించిన కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యేందుకు చౌడేపల్లె నుంచి పుంగనూరు వైపు కారును మళ్లించారు. మార్గమధ్యంలో దొరబావితోట వద్ద పోలీస్ సర్కిల్ కార్యాలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. గమనించిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయి తీవ్రగాయాలైన ముగ్గురినీ జేసీబీ సాయంతో వెలికి తీశారు. వారిని 108 అంబులెన్సులో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇదలా ఉంచితే, గాయపడిన మోటార్ సైక్లిస్టుల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- రేపే వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- మార్చి 8వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా ఆలయ గోపురం, పుష్కరిణి



ఆలయ ప్రవేశ మార్గంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి తొమ్మిది రోజుల పాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులను దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. అలంకార మండపం, నాలుగు మాడవీధులలో రంగవల్లులను తీర్చిదిద్దారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్ కటౌట్లు

శ్రీకల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్వామి, అమ్మవారి చిత్రాలు, స్వామివారి దశావతారం, శంఖు చక్ర నామాల విద్యుత్ కటౌట్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మార్చి 8వ తేదీన ఉదయం నిర్వహించే చక్రస్నాన ఘట్టం కోసం శ్రీవారి పుష్కరిణిని సిద్ధం చేశారు. దేశ విదేశాల నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల పుష్పాలను స్వామివారి ఆలయంలో అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వాహన సేవల వివరాలు

29వ తేదీన ఉదయం – ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహనం, మార్చి 1వ తేదీన ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 2న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 3న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 4న ఉదయం పల్లకీ ఉత్సవం(మోహినీ అవతారం), రాత్రి – గరుడ వాహనం, 5న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహనం, 6న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 7న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 8న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహించనున్నారు.